

సన్నాల వైపు చూపు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరగనున్న సాగు

- క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటనతో రైతుల్లో ఉత్సాహం
- వానాకాలంలో సన్నాల సాధారణ సాగు 7.87లక్షల ఎకరాలు
- అదనంగా 1.85 లక్షల సాగుకు అవకాశం
- తెలంగాణ సోనా రకానికి పెరగనున్న మరింత డిమాండ్
- విత్తనాల సరఫరాకు ఇప్పటి నుంచే సన్నాహాలు
- త్వరలో అన్నదాతలకు అవగాహన సదస్సులు

హనుమకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించే సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చే పథకాన్ని వచ్చే వానా కాలం సీజన్ నుంచే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖరీఫ్‌లో సన్న రకం వరి సాగు గణనీయంగా పెరిగనున్నది. సాధారణ వరి సాగు విస్తీర్ణం కన్నా అదనంగా 15 నుంచి 20 శాతం పెరగవచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధరణంగా ఖరీఫ్‌లో వరిసాగు 80 నుంచి 82 శాతం ఉంటుంది. రబీలో దొడ్డు రకాలనే రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో నీటి అందుబాటు, సానుకూల వాతావరణం దృష్ట్యా రైతులు సహజంగానే సన్న రకం వరి సాగు వైపు ఎక్కువ చూపుతారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో సహజంగానే రైతులు సన్నాల సాగును మరింత ఎక్కువ చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

9.27లక్షల ఎకరాల్లో వరి సాగు

ఉమ్మడి వరంగల్ సాగు ప్రణాళికలను వ్యవసాయ శాఖ అప్పుడే సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వరిసాగు ప్రతిపాదనలను కూడా రూపొందించింది. దీని ప్రకారం వచ్చే వానాకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.27 లక్షల ఎకరాల మేర వరి సాగు కావచ్చునని అంచనా వేసింది. హనుమకొండ జిల్లాలో 1.48 లక్షలు, వరంగల్ జిల్లాలో 1.35 లక్షలు, జనగామ జిల్లాలో 2.10 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.17 లక్షలు, ములుగు జిల్లాలో 1.12 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో వరి సాగు ప్రతిపాదనలు ప్రణాళికల్లో పొందుపరించారు. అయితే ఎప్పుడైనా సాధారణంగా ఈ మొత్తంలో సన్నరకాల సాగు 7.41 లక్షల మేరకు ఉంటుంది. మిగతాది దొడ్డు రకం. అయితే రూ.500 బోనస్ ప్రకటనతో సీన్ రివర్స్ కానున్నది. వచ్చే వానాకాలం సీజన్‌లో సన్నరకాల సాగు అదనంగా 15 నుంచి 20 శాతం 1.85 లక్షల ఎకరాలు పెరగవచ్చునని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇంతకన్నా ఎక్కువే ఉన్నా ఆశ్చర్య పోనక్కర లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అంటే ఈ లెక్కన ఖరీఫ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సన్నాల సాగు మొత్తంగా 9.26 లక్షల ఎకరాలు ఉండవచ్చునని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే దొడ్డు రకాల సాగు దాదాపు ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. ఒక వేళ స్థానికంగా ఉండే అననుకూల పరిస్థితులు, అనివార్యకారణాలు, మరింత పెరిగే వరిసాగు విస్తీర్ణం దృష్ట్యా దొడ్డు రకం సాగు లక్ష నుంచి లక్షా 50వేల ఎకరాల మేరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఎకరాకు వరి దొడ్డురకం 24 నుంచి 25 క్వింటాళ్ల వరకు వస్తే సన్న రకం 20 నుంచి 22 క్వింటాళ్లు వస్తుంది. ప్రస్తుతం మద్దతు ధర సన్నరకం రూ.2203. దొడ్డు రకం రూ.21.83 చెల్లిస్తున్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం మద్దతు ధర రూ.20 మినహా పెద్దగా తేడా ఏమీ లేదు. అయితే సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంవల్ల రైతుకు సన్నరకం వడ్లకు ఎకరానికి అదనంగా రూ.11వేల వరకు లభిస్తాయి. అందువల్ల ఖరీఫ్‌లో సన్నరకం సాగుకే అన్నదాత ఎక్కువ మొగ్గుచూపడం ఖాయంగా కనిపిస్తోంది. దీనికితోడు ఇప్పటికే బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఇప్పుడు ప్రభుత్వం సన్నబియ్యం సాగు చేసే రైతులకు అదనంగా మరో రూ.500బోనస్ ఇవ్వనుండడంతో సన్న రకాల సాగు మరింత పెరిగే అవకాశాలున్నాయి.

దిగుబడి తగ్గినా..

సాధారణంగా సన్నరకాల సాగులో రిస్క్ కాస్త ఎక్కువే. పైగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడి తక్కువ. దొడ్డు రకాలు సగటున ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరక దిగుబడి వస్తుంది. అదే సన్నరకాలైతే ఎకరానికి సగటున రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సాగు సమయం ఎక్కువ. దీనితో పాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే ధర విషయానికి వచ్చే సరికి సన్నాలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాలకు క్వింటాల్‌కు ప్రైవేటు మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.600 అధిక ధర లభిస్తోంది. సన్నాలకు ఇప్పుడు మార్కెట్‌లో క్వింటాల్ రూ.2500పైగా అమ్మకం అవుతున్నాయి. మార్కెట్ వరకు తీసుకువెళ్లకుండానే పొలాల వద్దనే ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు ఇంటి అవసరాలకు కొత్త ధాన్యాన్ని రైతు తీసిపెట్టుకుంటున్నాడు. దీనితో ప్రభుత్వానికి అవసరమైన సన్న బియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

డిమాండ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులతోపాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్న బియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు స్థానిక రైతులను ప్రోత్సహించి సన్నధాన్యం సాగుపెంచాలని భావిస్తోంది.

సన్నరకాల విత్తనాలకు డిమాండ్

సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వా లన్న నిర్ణయంవల్ల సాగులో చోటు చేసుకునే మార్పులు, చేర్పులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ సాగు ప్రణాళికలను సవరించే పనిలో పడింది. సన్నాల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఆ మేరకు విత్తనా లను అందుబాటులో ఉంచే దిశగా అధికారులు అప్పుడే దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో సన్నరకం వరి విత్తనాలు చాలినంత మేరకు అందుబాటులో ఉంచేలా సన్నాహాలు చేస్తున్నారు. సన్నాల్లో 20కిపైగా రకాలు ఉన్నాయి. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ సోనాకు మంచి డిమాండ్ ఉంది. బీపీటీ, సాంబమసూరి, ఆమన్, కూనారం 1618 తదితర రకాలను కూడా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. బిపీటి 5204 (సాంబ మషూరి) ఎంటీయూ-1001 (విజేత), బీపిటి-3291 (సోనామషూరి) ఎంటీయూ-1010 (కాటన్ దొర సన్నాలు), ఎస్ఎల్ఆర్-115 (సర్ణముఖి), జ్గయల్-1798 (జగిత్యాల సన్నాలు), ఎంటీయూ-7029 (స్వర్ణ), డబ్ల్యుజీఎల్-20471 (ఎర్రమల్లేలు), తెల్లహంస మొదలైన రకాల పట్ల రైతులు ఎక్కువ మొగ్గుచూపనున్న దృష్ట్యా ఈ రకం విత్తనాలకు వచ్చే వానాకాలంలో సీజన్‌లో డిమాండ్ బాగా పెరిగే అవకాశాలు లేకపోలేదు. సన్నాలకు రూ.500 బోనస్ నేపథ్యంలో వీటిని సాగు చేసే రైతులకు త్వరలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



బ్యారేజీకి ఎగువన కొనసాగుతున్న పనులు

వరదలను తట్టుకొనేలా..

'మేడిగడ్డ'లో తాత్కాలిక మరమ్మతు పనులు

- బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు
- పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్
- ఇప్పటికే 15వ నెంబర్ గేట్ ఎత్తివేత
- మిగిలిన గేట్ల ఎత్తివేతకూ చర్యలు
- ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగానే ప్రక్రియ

మహదేవపూర్ రూరల్, మే 21 : కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 పిల్లర్లు వానాకాలం వరదను తట్టుకునేలా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఎగువన ఇప్పటికే ఉన్న షీట్‌ఫైల్స్‌ను తొలగించారు. ప్రాణహిత, గోదావరి నదుల నుంచి వచ్చే వరదను తట్టుకుని నిలబడేలా పిల్లర్ల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గేట్లను ఎత్తి.. నీరు దిగువకు వెళ్లేలా..

మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 85 గేట్లుండగా బ్లాక్-7లో 11గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 21న బ్యారేజీలోని బ్లాక్-7లో 20 నెంబరు పిల్లరు భారీ శబ్దాలు చేస్తూ కుంగుబాటుకు గురికాగ ఆపిల్లరుకు ఇరువైపులా ఉన్న పిల్లర్లు కూడా పాక్షికంగా కుంగాయి. అదే బ్లాకులో ఉన్న మిగతా పిల్లర్లకు కుంగుబాటు విస్తరించే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు బ్యారేజీలో అప్పటికే నిల్వ ఉన్న 10.10టీఎంసీల నీటిని బ్లాక్-7 గేట్లు మినహా మిగతా బ్లాకుల్లో గేట్లన్నీ ఎత్తి దిగువకు విడుదల చేశారు. అప్పటి నుండి బ్లాక్-7గేట్లన్నీ మూసే ఉండగా మిగతా గేట్లన్ని ఆపరేషన్‌లోనే ఉన్నాయి. దీనిపై ఎన్‌డీఎస్ఏ, ఇతర నిపుణుల బృందాలు పరిశీలన చేసినప్పటికి పునరుద్ధరణకు ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా వానాకాలం దగ్గరపడుతుండటంతో బ్లాక్-7లో గేట్లు వరదను తట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) మధ్యంతర నివేదికలో పేర్కొనడంతో అధికారులు ఆదిశగా కసరత్తు ప్రారంభించారు. ఈనెల 17న బ్లాక్-7లో 15వ గేట్‌ను ఎత్తిన అధికారులు మిగతా గేట్లను ఎత్తేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. గేట్లు ఎత్తితే మిగతా గేట్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రెండు బృందాలుగా అధికారులు పనులను చేపట్టినట్లు తెలిసింది. 16వ నెంబరు గేటుకు ఎగువన దిగువన టెక్నికల్‌గా అందివాల్సిన సపోర్ట్‌ను సిద్ధం చేశాకే ఆగేటును, మిగతా గేట్లను ఎత్తనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈవానాకాలం వెళ్లేంత వరకు కేవలం వచ్చిన నీరు దిగువకు సాఫీగా వెళ్లేందుకు మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు.

దిగువన షీట్‌ఫైల్స్.. పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్

బ్లాక్-7లో గేట్లు, పిల్లర్లు వరదను తట్టుకునేందుకు బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు. వరద తాకిడికి పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద నుంచి ఇసుక వెళ్లి బుంగ పడే అవకాశం ఉండటంతోనే బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు తప్పని సరైనట్లు అధికారులు భావిస్తున్నారు. పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద ఉండే ఇసుకు జారుకుంటూ వచ్చి షీట్‌ఫైల్‌ను తాకి అక్కడే

మిగతా 6వ పేజీలో..





జన్ను ఆదాం (ఫైల్) జన్ను విజయ్ (ఫైల్) జినుక గౌతమ్ (ఫైల్)

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది

వివరాలు 7లో..

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత
- కుటుంబాల్లో విషాదం మిగిల్చిన వేర్వేరు ఘటనలు

కేయూ ఇన్‌చార్జ్ వీసీగా కరుణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గతంలో 'వరంగల్' కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం
- ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీ లేనట్టేనా?



వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పదవీ కాలం మంగళవారం ముగిసింది. దీంతో అదే రోజున ఇన్‌చార్జి వీసీగా కరుణను ప్రభుత్వం నియమించింది. కరుణ నియామకంపై అధ్యాపక, విద్యార్థి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడం, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరుండడంతో కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీస్తారనే నమ్మకం ఉందని చెబుతున్నారు.

సుపరిచుతురాలే..

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వాకాటి కరుణకు మంచి పేరుంది. కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా అందరి మన్ననలు అందుకుంది. ఆమె నియామకం పట్ల వర్సిటీ వర్గాల్లోనూ సానుకూల అభిప్రాయలే వ్యక్తం అవుతున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడంతో తాజా మాజీ వీసీ రమేష్‌పై జరుగనున్న విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగే అవకాశం ఉన్నట్లు వారు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనపై వచ్చిన అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని అధ్యాపక, విద్యార్థి వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

పూర్తిస్థాయి వీసీ నియామకం లేనట్టేనా?

కేయూకు ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీని నియమించే అవకాశాలు లేనట్లు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కేయూకు మాత్రం ఏర్పాటు చేయలేదు. వీసీ పదవీ కాలం ముగింపునకు మూడు రోజుల ముందే విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడం, తీవ్రమైన ఆరోపణల మధ్య వీసీ పదవీ కాలం ముగియడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేయూ లో గందరగోళ పరిస్థితులు ఉండటంతో వర్సిటీ పాలన గాడిలో పడేంత వరకు ఐఏఎస్ అధికారిని వీసీ ఇన్‌చార్జిగా కొనసాగించి ఆందోళనలు సద్దుమణి గాక పూర్తి స్థాయిలో వీసీని నియమించే అవకాశాన్ని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మే 21: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను జూన్ 10 నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలలు, తాగునీటి సరఫరా, విద్యార్థుల యూనిఫాంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన 464 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో 345పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, మిగతా పాఠశాలల్లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్యలచే స్కూల్ యూనిఫాం తయారీలో వేగంపెంచి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మిషన్ భగీరథ నీటితోపాటు స్థానికంగా ఉన్న నీటిని గ్రామ పంచాయతీలలో సరఫరా చేయడం జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. లీకేజీలను అరికట్టి, ఎప్పటికప్పుడు పంపుసెట్లు మరమ్మతులు చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలంలో లీకేజీలు లేకుండా చూస్తూ క్లోరినేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వర్షాకాలంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. సమావేశంలో డీఈవో వాసంతి, డీఆర్‌డీవో కౌసల్యదేవి, డీపీవో కల్పన, నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్, మెప్మా, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు నగరానికి కేటీఆర్



రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్‌కు వస్తున్నారు. బుధవారం ఉదయం 11గంటలకు నర్సంపేటలో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్న కేటీఆర్.. మధ్యాహ్నం హనుమకొండకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని నాని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4గంటలకు సీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల సమావేశంలో పాల్గొననున్నారు.



కోటి మల్లెలతో పుష్పార్చన

గీసుగొండ, మే 21: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి శ్రీలక్ష్మినరసింహస్వామి జయంతిని పురస్కరించుకొని వైశాఖ మాస కోటి మల్లెపూలతో పుష్పార్చన సేవను మంగళవారం నిర్వహించా రు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య కళాబలంధ స్తోత్రం, పుట్టకు అలంకరణ, విష్ణు సాహస్రనామ పారాయ ణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ గ్యాస్ పక్కదారి



- జోరుగా రీ ఫిల్లింగ్
- యథేచ్ఛగా అక్రమ దందా
- పట్టించుకోని సివిల్ సప్లయీస్ అధికారులు

వరంగల్ కలెక్టరేట్, మే 21: సబ్సిడీ గ్యాస్ రీ ఫిల్లింగ్ దందా జోరుగా సాగుతోంది. జనవాసాల మధ్య అక్రమంగా రీ ఫిల్లింగ్ జరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు జంకుతున్నారు. ఒక్కో గ్యాస్ సిలిండర్(చిన్నవి)లో 2 నుంచి 3 కిలోల గ్యాస్‌ను నింపుతుండగా, కిలోకు రూ.130 చొప్పున వసూలుచేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, గ్యాస్ డెలివరీ చేసేవారు అక్రమంగా సబ్సిడీ గ్యాస్‌ను పక్కదారి పట్టిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్సిడీ గ్యాస్ సిలండర్లు సైతం వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

సబ్సిడీ గ్యాస్‌తో పెరిగిన దందా..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఒకటైన మహాలక్ష్మీ కింద రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తుండటంతో అక్రమ రీ ఫిల్లింగ్ మరింత ఎక్కువగా సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్ సిలిండర్లు తక్కువగా వినియోగించుకునే వారిని గ్యాస్ డెలీవరి బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు గుర్తించి వారిచే గ్యాస్ బుక్ చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీ డబ్బులు మీరే తీసుకోండి అని వినియోగదారులకు చెప్పి గ్యాస్ బుక్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా బుక్ చేసిన గ్యాస్ సిలిండర్లను రీ ఫిల్లింగ్, ఇతర వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తూ వేయిరూపాయల నుంచి రూ.1100 వరకు విక్రయిస్తున్నారు. నగరం, మండల కేంద్రాల్లో మినీ గ్యాస్ సిలిండర్ల విక్రయాలు బహిరంగంగానే కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లలోని గ్యాస్‌ను మినీ సిలిండర్లలోకి రీ ఫిల్లింగ్ చేసి విక్రయాలు జరుపుతున్నారు. ఇళ్ల మధ్యలో రీ ఫిల్లింగ్ చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై మండిపడతున్నారు. రీ ఫిల్లింగ్ చేసే సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలోని గ్యాస్ కనెక్షన్లు ఇలా...

జిల్లాలో 15 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. మొత్తం 400289 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇందులో సింగిల్ సిలిండర్లు 265132, డబుల్ సిలిండర్లు 135157, సీఎస్ఆర్ 18280, దీపం పథకం కింద 62862, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 46195 ఉన్నాయి.

హోటళ్లు.. రెస్టారెంట్లు టార్గెట్‌గా..

పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ లాంటి వ్యాపారులు కమర్షియల్ సిలిండర్లు వినియోగించాల్సి ఉంటుంది. ఇలాంటి వ్యాపారులను దృష్టిలో పెట్టుకుని రీ ఫిల్లింగ్ దారులు పేట్రేగిపోతున్నారు. కమర్షియల్ సిలిండర్ ధర ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ సిలిండర్లను రీ ఫిల్లింగ్ చేసిన కొందరు కొందరు దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రాయితీ సిలిండర్లు వినియోగిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

కేసులు నమోదు చేస్తున్నా...

అధిక లాభాల కోసం అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలెండర్ల నుంచి మోటార్ల ద్వారా మినీ సిలిండర్‌లోకి రీ ఫిల్లింగ్ చేసి అధిక మొత్తానికి డబ్బులకు ప్రజలకు విక్రయిస్తూ మోసం చేస్తున్న వారిని ఇటీవల ఇంతేజార్‌గంజ్ పోలీసులు దాడిచేసి అరెస్టు చేశారు. నగరంలోని గిర్మాజీపేటలో తదితర ప్రాంతాల్లోని గ్యాస్ సర్వీస్ సెంటర్లలో మినీ సిలిండర్లలోకి గ్యాస్ నింపుతుండగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు, వరంగల్ డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై సిబ్బందితో దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 14.2 కిలోల ఖాళీ సిలిండర్‌ను, 4 కేజీల 13 ఖాళీ సిలిండర్లను, మూడు మోటార్లను స్వాధీన పర్చుకొని వారిపై కేసు నమోదు చేశారు. అయినా అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ దందా ఆగడం లేదు.

రీ ఫిల్లింగ్ చేస్తే కేసులే..

శివప్రసాద్‌రెడ్డి,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



సబ్సిడీ గ్యాస్‌ను రీ ఫిల్లింగ్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్న వారిపై కేసు లు నమోదు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి రీ ఫిల్లింగ్ నిర్వాహకులను హెచ్చరించడం జరుగుతుంది. సబ్సిడీ గ్యాస్‌ను మినీ సిలిండర్లలో నింపి విక్ర యించడం చట్టరీత్యా నేరం. సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సబ్సిడీ గ్యాస్ వినియోగిస్తే చర్యలు తప్పవు.

ఎంజీఎంలో నిలిచిన విదుత్ సరఫరా



అంధకారంలో ఎంజీఎం ఆస్పత్రి ఆవరణ

వరంగల్ మెడికల్, మే 21: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం సుమారు ఆరు గంటలకుపైగా విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. సాయంత్రం 4.30 గంటలకు పోయిన కరెంటు.. రాత్రి 9.30 గంటల వరకు వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ల ద్వారా ఎమర్జెన్సీ వార్డులకు కరెంటు అందించారు. చాలావార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు బయటకు వచ్చారు. వేసవి ఉక్కపోతకు ఇబ్బంది పడ్డారు. గతంలో కూడా ఇలాగే జరిగినా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. వచ్చే వర్షాకాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే సాధారణ రూములతోపాటు ఎమర్జెన్సీ రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన అకుట్ సభ్యులు

కేయూలో వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర

చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్

వీసీ కీలక ఫైళ్లు మాయం చేస్తున్నారని అధ్యాపకుల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. మంగళవారం పరిపాలన భవనం ఎదుట వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. 'తాటికొండ అవినీతి అనకొండ' అనే ఫ్లెక్సీతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వీసీ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. మంగళవారం వీసీ పదవీ కాలం ముగియడంతో కొన్ని ముఖ్యమైన ఫైళ్ల మాయం చేశారని విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేశారు. వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వీసీ అక్రమాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, కేయూలో వీసీ రమేష్ లాడ్జీ నుంచి కీలక ఫైళ్లు యామమైనట్లు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ యూనియన్(అకుట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు అయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. వీసీ లాడ్జీ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా వీసీ రమేష్ తన పాలనను లాడ్జీ నుంచే కొనసాగించారని, విజిలెన్స్ విచారణంలో అవసరమ్యే ఫైళ్లను ఫ్యాబ్రికేట్ చేయడానికి బయటకు తరలించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ కారులో వాటిని బయటకు తీసుకెళ్లడంపై తమకు అనుమానం ఉన్నదన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలు, మార్కుల లిస్టులు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉన్నట్లు వారు అనుమానాలు వ్యక్తం చేశారు. న్యాక్‌కు సంబంధించిన బిల్లులను సరిచేయడంతో పాటు ఇతరత్రా ఫైళ్లలో మార్పులు, చేర్పులు చేసేందుకు వీసీ ఫైళ్లను తరలించి ఉంటారని ఆరోపించారు.

కాగా, ఈ విషయమై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వీసీ రమేష్ తన వ్యక్తిగత పుస్తకాలు, జ్ఞాపికలు తదితర వస్తువులు తీసుకెళ్లి ఉంటారని సర్దిచెప్పడాన్ని వారు త్రీంగా ఖండించారు. ఒకానొక దశలో రిజిస్ట్రార్‌తో అకుట్ సభ్యులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జీ నుంచి ఫైళ్ల మాయం, సీసీ కెమెరాల ఫుటేజీ కోసం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లపై కేసు

వరంగల్ క్రైం, మే 21: ఈనెల 11న కె.రాజేష్ అనే వ్యాపారిపై జరిగిన దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లతోపాటు ఒక ప్రభుత్వ ఉద్యోగిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 11న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం.డి.తాజొద్దిన్ పుట్టిన రోజు విందుకు మరో ఇద్దరు కానిస్టేబుళ్ల కరుణాకర్ (బచ్చన్నపేట), రమేశ్ (రాయపర్తి)తో పాటు మహేందర్‌రెడ్డి (ప్రభుత్వ ఉద్యోగి), కె.రాజేష్ (వ్యాపారి) హాజరయ్యారు. విందులో తాజొద్దిన్‌తోపాటు మరో ముగ్గురు.. మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. కానిస్టేబుళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించిన రాజేష్.. వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన నలుగురు.. రాజేష్‌ను కారులో తీసుకువచ్చి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్ వద్ద దాడి చేసి వదిలి వెళ్లారు. రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు.. తాజొద్దిన్, కరుణాకర్, రమేశ్‌తోపాటు మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు విషయాన్ని కేయూ పోలీసులు రహస్యంగా ఉంచారు.



బ్యారేజీకి దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లు

వరదలను తట్టుకొనేలా..

(5వ పేజీ తరువాయి)

ఆగితే వరద ప్రభావం నివారించవచ్చనే షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా బ్యారేజీకి దిగువన ఉన్న కాంక్రీటు స్లాబ్‌ను కట్‌చేస్తూ పనులను ముమ్మరం చేస్తున్నారు. దీంతో పాటు పిల్లర్లు కుంగుబాటుకు గురైన తర్వాత బ్లాక్-7లో చేపట్టిన ఈఆర్‌టీ(ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్), జీపీఆర్(జియో ఫిజికల్ రాడార్) టెస్టుల ఆధారంగా గ్రౌంటింగ్ చేయనున్నట్లు తెలిసింది. ఫోమ్ గ్రౌంటింగ్‌తో పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల క్రింద ఉన్న బుంగలను పూడ్చాలని తొలుత నిర్ణయించినా.. ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సాండ్ గ్రౌంటింగ్‌తోనే వాటి కింద ఉన్న బుంగలను పూడ్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సాండ్ గ్రౌంటింగ్ ప్రక్రియలో ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగా ర్యాఫ్ట్‌లకు హోల్స్ వేసి ఇసుక, స్యాండ్‌ను మిక్స్‌ను వేసి బుంగలను పూడిస్తే మళ్లీ వచ్చే వరదలకు సీపేజీ సమస్యను నివారించడంతోపాటు తాత్కాలికంగా ర్యాఫ్ట్, పిల్లర్లకు అదనపు శక్తి చేకూరుతుందనేది సాండ్ గ్రౌంటింగ్ ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు.

బ్యారేజీలో అప్రోచ్ రోడ్ల తొలగింపు

బ్లాక్-7లో గేట్ల ఎత్తివేత, స్యాండ్ గ్రౌంటింగ్, బ్యారేజీకి దిగువన షీట్ ఫైల్స్ ఎర్పాటు పూర్తవ్వగానే గోదావరి నదిలో బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లను సైతం తొలగించనున్నారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో ఉన్న కాఫర్‌డ్యామ్‌కు సంబంధించి ఉన్న షీట్‌ఫైల్స్, కాంక్రీటు వ్యర్థాల తొలగింపు ప్రక్రియ గతంలోనే ప్రారంభమవగా.. అది చివరి దశకు చేరుకుంది.

సివిల్స్ అభ్యర్థులకు ఉపకార వేతనాలు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న స్వచ్ఛందసంస్థ

జఫర్‌గఢ్, మే 21: సివిల్స్ శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొంగర ఎడ్యుకేషన్ హైద్రాబాద్ సంస్థ ప్రతినిధులు కొంగర గంగాధర్‌రావు, జెట్టి రవికుమార్ తెలిపారు. మంగళవారం వారు జఫర్‌గఢ్‌లో మాట్లాడుతూ.. సివిల్స్ పరీక్ష రాయాలనే అభ్యర్థులు.. శిక్షణ పొందేందుకుగాను తమ సంస్థ యేటా ఉపకార వేతనాలు అందిస్తోందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులని, ఈ పరీక్ష ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి వారికి సివిల్స్ శిక్షణ కోసం ఉపకార వేతనాలు అందజేస్తామని అన్నారు. అభ్యర్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జూన్ 23వ తేదీన వరంగల్‌లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఎలాంటి రుసుము లేదన్నారు. పూర్తి వివరాలకు 9346777568 మొబైల్ నంబరులో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు సూచించారు.

గ్రీన్ చాంపియన్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ చాంపియన్ అవార్డుల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈసెట్‌లో మెరిసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు



ఎం. నవ్యశ్రీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: ఈసెట్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్.దీక్షిత్ 3వ ర్యాంకు, పి.వివేక్ 4వ ర్యాంకు, బి.హేమశ్రీ 9 ర్యాంకు, పి.నాగసాయి 19వ ర్యాంకు సాధించారన్నారు. ఈసీఈలో ఎం. నవ్యశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, వి.వైష్ణవ్ 2, వి.అర్షిత 5, కె.హర్షిత్ 6, పి.హారిక 7, ఎం.డి. సొహైల్ 11, ఈఈఈలో టి.శ్రీవాత్సవ్ 2, ఎం.కౌశిక్ కుమార్ 4, మెకానికల్‌లో కె.చందు 2, బి.నిఖిల్ 10, ఓ.గౌతమ్ 12వ ర్యాంకు సాధించారన్నారు.

ఈ- సేవల మూగనోము!

- వారం రోజులుగా పని చేయని కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- లక్షల్లో నిలిచిపోయిన పన్ను చెల్లింపులు
- మరో ఐదు రోజుల పాటు ఇదే పరిస్థితి



హనుమకొండ అశోకా జంక్షన్ వద్ద మూసి ఉన్న ఈ-సేవా కేంద్రం

వరంగల్ కార్పొరేషన్, మే 21: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు పన్నుల చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇంటి పన్నులు, యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించాలని నగర పాలక సంస్థ మైకులు పెట్టి మరీ ప్రచారం చేసింది. అయితే ప్రయోజనముంది.. పన్నులు వసూలు చేయాల్సి బల్దియా ఈ-సేవ కేంద్రాలు మూగ నోములు నోముతున్నాయి. వారం పాటు ఈ-సేవలు అందించక అక్కడి కంప్యూటర్ల స్ర్కీన్లు మసకబారిపోయాయి. అక్కడ పని చేసే సిబ్బంది ప్రజలకు చెప్పలేక కార్యాలయాలకు తాళం వేసి బయటకు వెళుతున్నారు. సాంకేతికలోపంతోపాటు నెట్‌వర్క్ సవరణ చేస్తుండడంతో ఈ ఇబ్బంది ఏర్పడినట్టు వినియోగదారులకు సిబ్బంది చెబుతున్నారు. నగర పాలకసంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తుండగా, ఒక్క సెంటర్‌లో కూడా సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ వెకెట్ ల్యాండ్ చార్జీలతో పాటు మరి కొన్ని యూజర్ చార్జీలు చెల్లించేందుకు వచ్చిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. గడువు తేదీ దాటిపోయి అదనపు భారం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్షల్లో నిలిచిపోయిన పన్నులు

ఈ- సేవా కేంద్రాల్లో సాంకేతిక లోపం ఏర్పడడంతో బల్దియా ఖజానాకు గండిపడింది. ప్రతీ రోజు వివిధ రూపాల్లో లక్షల్లో వసూలయ్యే డబ్బు ప్రజల వద్దనే ఉండిపోతోంది. ఇప్పటికే బల్దియా మలేరియా సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు జీతాల కొరత ఉన్నప్పటికీ వారం రోజులుగా కంప్యూటర్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు సిబ్బంది తమ తప్పు ఏమిలేదని, అంతా హైదరాబాద్‌లో వరంగల్ జీడబ్ల్యుఎంసీ సైట్ అప్‌డేట్ చేయడం వల్ల ఈ సమస్య ఎదురైందని చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా మరో ఐదు రోజుల పాటు ఇదే సమస్య ఉంటుందని కంప్యూటర్ నిపుణులు, సెంటర్ల ఉద్యోగులు పేర్కొంటున్నారు. పన్నుల చెల్లింపులు వేగవంతం కావాలంటే ఈ- సేవా కేంద్రాలు త్వరంగా పని చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నక్కలగుట్టలో పని చేయని ఈ-సేవా కేంద్రం

బల్దియా పరిధిలో ఈ- సేవా కేంద్రాలు

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. హనుమకొండ పరిధిలో కాజీపేట సర్కిల్ ఆఫీస్-2, సుబేదారి వాటర్ ట్యాంక్, నక్కలగుట్ట బల్దియా కార్యాలయం, మచిలీబజార్ కమ్యూనిటీ హాల్, అశోకా జంక్షన్ సర్కిల్, నయీంనగర్‌లో ఈ- సేవ సెంటర్లు పని చేస్తున్నాయి. అదే విధంగా వరంగల్ పరిధిలో బల్దియా ప్రధాన కార్యాలయం, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ సర్కిల్-1, హెడ్‌పోస్ట్ ఆఫీస్, శివనగర్, కరీమాబాద్‌లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ- సేవలు ప్రజలకు సేవలందిస్తాయి. ఇందులో ఒక్కో సెంటర్‌లో ఇద్దరి నుంచి ముగ్గురు పనిచేస్తారు. ఈ కేంద్రాలను వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట డిప్యూటీ కమిషనర్‌లు పర్యవేక్షిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది..

అనిసుర్ రషీద్, బల్దియా అదనపు కమిషనర్

ఏప్రిల్ చివరి వరకు ఇంటి పన్నులో వడ్డీలో 5శాతం రాయితీ ఇచ్చాం. కొందరు చెక్కులు సమర్పించి రశీదులు పొందారు. కానీ కొన్ని చెక్కులు బ్యాంకులో చెల్లుబాటుకాక పోవడం, బల్దియాకు డబ్బులు చెల్లించినట్టు రశీదేలు కలిగి ఉండడంతో ఈ సమస్య ఎదురైంది. ఈ సమస్యలు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ చూస్తుంది. ఒకటి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారం జరిగి ప్రజలకు సేవలు అందిస్తారు.

భద్రకాళి సన్నిధిలో పుల్లెల గోపీచంద్



భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న పుల్లెల గోపీచంద్ దంపతులు

వరంగల్ కల్చరల్, మే 21: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పద్మశ్రీ పుల్లెల గోపీచంద్ దంపతులు మంగళవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితోపాటు క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వీరి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది..

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత

కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు



జన్ను ఆదాం, జన్ను విజయ్ మృతదేహాలు

వరంగల్‌సిటీ/ బయ్యారం, మే 21: ఎండలవేళ ఈత సరదా ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఓ బాలుడు సహా ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలను ఆయా కుటుంబల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలివీ.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన జన్ను విజయ్ అలియాస్ ఏసు(38), జన్ను ఆదాం(34) ఇద్దరూ పెయింటర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇరుగుపొరున ఉండే ఈ ఇద్దరు రోజూ లాగే మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చారు. అప్పటికే ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో జన్ను విజయ్, తన కుమారుడు జన్ను వివేక్, జన్ను ఆదాం తన కుమారుడు జన్ను ఆదిత్య, స్థానికంగా ఉండే మరోవ్యక్తి జన్ను రాహుల్ కలి టసి ఈత కొట్టేందుకని గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంట వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలను గట్టున ఉంచి.. విజయ్, ఆదాం నీటిలోకి దిగారు. వారు ఈత కొడుతూ ఆ కుంటలో ఉన్న బురదగుంతలో చిక్కుకుని ఎంతకీ పైకి రాలేదు. గట్టుపైనున్న వారి పిల్లలు గమనించి కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీ, దేశాయిపేటకు చెందిన వారు అక్కడికి చేరుకుని గాలించి.. వారిని బయటికి తీయగా అప్పటికే విజయ్, ఆదాం మృతిచెందారు. అప్పటికే ఈ సమాచారం అందుకున్న ఏనుమాముల ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జన్ను ఆదాం భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదాంకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉండగా, విజయ్‌కి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఎంజీఎం మార్చ్యురీకి తరలించామని, ఎస్ఐ శ్రీకాంత్ కేసును దర్యాప్తు చేస్తున్నారని సీఐ పులి రమేష్ తెలిపారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి బాలుడు..



గౌతమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని దామెరచెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన జినుక లక్ష్మీనారాయణ, రేణుక దంపతుల కుమారుడు గౌతమ్ (14) మహబూబాబాద్‌లోని సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన గౌతమ్ ఈత నేర్చుకునేందుకని తన చిన్నమ్మ కుమారుడు గోపాలదాసు గణేష్‌తో కలిసి తమ ఇంటి సమీపంలోని దామరచెరువుకు వెళ్లాడు. అయితే అతడు తాను దిగిన ప్రాంతంలో లోతుగా ఉందన్న విషయాన్ని గమనించని గౌతమ్ నీటిలో మునిగి మృతి చెందాడు. అతడికి తోడుగా వెళ్లిన గణేష్ పరుగున ఇంటి వచ్చి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో వారు స్థానికుల సాయంతో చెరువులో వెతికి.. గౌతమ్‌ను బయటకు తీసి బయ్యారం పీహెచ్‌సీకి తరలించారు. కానీ గౌతమ్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. గౌతమ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జినుక లక్ష్మీనారాయణకు కుమారుడు గౌతమ్, కుమార్తె ఉండగా.. కుమారుడి మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రె్‌సకు చెంపపెట్టులా ఉండాలి..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి

రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రె్‌సకు చెంపపెట్టులా ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న యూట్యూబ్ చానెల్ పెట్టి దందాలు చేసే చీటరని విమర్శించారు. ఆయనకు అవకాశం ఇస్తే ప్రమాదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంతర్‌రెడ్డి మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని ఆయన ఆరోపించారు. తీన్మార్ మల్లన్న, రేవంత్‌రెడ్డిలు ఇద్దరు ఇద్దరేనని, ఇద్దరు మోసగాళ్లేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటికూడా నెరవేర్చలేదన్నారు. చిన్నచిన్న కారణాలు చూపి కాళేశ్వరానికి నీరు రాకుండా చేశారని, కరెంటు, సాగునీరు అందించలేదన్నారు. ఆరోగ్యశ్రీ అతిగతీ లేదని, కల్యాణలక్ష్మీ పథకాన్ని బుట్టదాఖలు చేశారని, నిరుద్యోగ భృతి అందించలేదన్నారు. ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికల తర్వాత ఓ మాట రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల పక్షాన శాసనమండలిలో గళమెత్తుతాడని దయాకర్‌రావు తెలిపారు.

మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలరని, బీజేపీ అభ్యర్థి అసమర్థుడని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విద్యావంతుడు, ప్రజలకు సేవచేయాలనే తపన కలిగిన సమర్థుడని ఆయన తెలిపారు. పెద్దల సభ రైటర్స్‌కు వేదిక కావాలని, చీటర్స్‌కు వేదిక కాకూడదన్నారు. చీటరైన తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తికి అవకాశం కల్పిస్తే ప్రమాదమన్నారు. అధికార పార్టీని ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, సతీష్ బాబు, నేతలు సంజయ్, రవిందర్‌సింగ్, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న బీఆర్ఎస్ పార్టీ

మాజీ మంత్రి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, మే 21: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ.. ఇప్పుడు ఆదరణ లేక వెలవెలపోతున్నదని మాజీ మంత్రి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రుల మాటకే దిక్కులేదని, ప్రజలు వచ్చి సమస్యలు చెప్పుకున్నా పరిష్కరించే అధికారం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.7,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటేస్తే బాధితుల తరపున ప్రశ్నించలేరని పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. 2021 నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు రావల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వారు నరకయాతన అనుభస్తున్నారని ఈటల అన్నారు.

కుల, మత భేదం లేకుండా దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని పట్టభద్రులు బలపర్చాలని కోరారు. స్వచ్ఛభారత్ పేరుతో దేశంలో మారుమూల గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్ అమలు కావడానికి పదేళ్లు పట్టిందని, కానీ మోదీ చొరవతో భారత్ మూడేళ్లలోనే అమలులోకి వచ్చిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు సమస్యలను పరిష్కరించేందుకు మోదీని ఆశ్రయిస్తున్నాయన్నారు. అలాంటి కీర్తిని భారత్‌కు తీసుకొచ్చిన మోదీని ప్రజలు ఆదరించాలన్నారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్‌గాంధీ వరకు 'గరీబ్ హఠావో' అనే ఒకే నినాదంతో వస్తోంది తప్ప.. పేదరికాన్ని నిర్మూలించింది లేదని విమర్శించారు. ప్రేమేందర్‌రెడ్డి 40 ఏళ్ల అనుభవం, విద్యాభ్యాసం పట్టభద్రుల పక్షాన ప్రశ్నించేందుకు దోహదం చేస్తుందని ఈటల పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వాగ్దేవి కళాశాలల అధినేత దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో అవకతవకలు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రాంనగర్, మే 21: పౌర సరఫరాలశాఖ పరిధిలో జరుగుతున్న టెండర్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని, అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం బియ్యం సరఫరా, ధాన్యం టెండర్లు అర్హత లేని కేంద్రియ బండార్ లాంటి సంస్థలకు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై మూడురోజులుగా తాము ఆరోపణలు చేస్తున్నప్పటికీ మంత్రులు స్పందించడం లేదన్నారు. ఈ విషయంలో భారీగా డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. ఎవరికి ముట్టేవి వారికి ముట్టాయి కాబట్టే.. ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదని ఆయన దుయ్యపట్టారు. బీఆర్ఎస్ హయాంలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కేంద్రియ బండార్ సంస్థకు టెండర్లు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అవకతవకల విషయమై ఈనెల 23న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సివిల్ సప్లయి కమిషనర్‌కు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రవీందర్‌సింగ్, జోరిక రమేశ్, వీరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వర్క్‌షాపులో బల్దియా కమిషనర్

లేక్ ప్రొటక్షన్‌పై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 21: హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి సీడీఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర పాలక సంస్థ నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు బల్దియా ఎస్ఈ ప్రవీన్‌చంద్ర పాల్గొన్నారు. 'లేక్ ప్రొటక్షన్ అండ్ రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్' అనే అంశంపై వర్క్‌షాప నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీటి వనరులు కాపడడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని, ఒక రోజు వర్క్‌షాప ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామన్నారు. సీడీఎంఏ గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహిస్తే సహజ వనరులు రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, సీడీఎంఏ దివ్య దేవరాజన్, వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు



విజయ్ (ఫైల్)

కాజీపేట, మే 21: జిమ్ సెంటర్ బోర్డు సరిచేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఒకరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట నిట్ సమీపంలో పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న బ్లూఫిట్‌నెట్ జిమ్ సెంటర్ ఐరన్ ఫ్లెక్సీ బోర్డు ఇటీవల గాలివానకు ఊడిపోయింది. బోర్డును సరిచేసేందుకు జిమ్‌సెంటర్‌లో పనిచేసే దర్గా కాజీపేటకు చెందిన విజయ్(28) ప్రయత్నించగా కుదరలేదు. దీంతో జిమ్‌లో శిక్షణ కోసం వచ్చిన రాము, విష్ణు, సందీప్, విజయ్ కలిసి బోర్డును తీసేందుకు ప్రయత్నించగా ప్రక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు విజయ్‌కి తాకాయి. ఈ ఘటనతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో శిక్షణకు వచ్చిన రాము, విష్ణు, సందీప్‌లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, విజయ్ ఎంబీఏ పూర్తి చేసి జిమ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడు అవివాహితుడు.

'టెన్నిస్'పై క్రేజ్

నగరంలో విస్తరిస్తున్న క్రీడ

ఆసక్తి కనబరుస్తున్న యువత



లాన్ టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, మే 21: సంపన్నుల క్రీడగా పేరుగాంచిన లాన్ టెన్నిస్ క్రీడ నగరంలో రోజు రోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైన లాన్ టెన్నిస్ క్రీడపై నగరంలోని యువత ఆసక్తి కనబర్చుతున్నారు. క్రేజీ గేమ్‌గా పిలువబడే ఈ ఆటలో శిక్షణ పొందాలంటే సామాన్యులకు ఆర్థికంగా భారంగా ఉండేది. వేల రూపాయలతో రాకెట్‌లు కొనలేక సామాన్య యువకులు ఈ క్రీడపట్ల సుముఖత చూపించకపోయేవారు. ఇప్పుడు ఈ టెన్నిస్ క్రీడపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అతి తక్కువమంది ఆడే లాన్ టెన్నిస్ క్రీడ.. ఇప్పుడు నగరంలో అత్యాధునిక హంగులు, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన కోర్టులు అందుబాటులోకి రావడంతో చాలామంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో పలు ప్రయివేటు పాఠశాలతో పాటు డీఎస్ఎ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియం సమీపంలో అత్యాధునిక హంగులతో కూడిన (సింథటిక్) టెన్నిస్ కోర్టు, అదే విధంగా సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లోని టెన్నిస్ కోర్టుల్లో రోజూ వందల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో మే1 నుంచి ఏర్పాటు చేసిన లాన్ టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో నగరంలోని యువత పెద్దఎత్తున ఉత్సాహం కనబర్చుతున్నారు.

అధునాతన కోర్టులు

హనుమకొండ జేఎన్ఎస్‌లో రెండు సింథటిక్ కోర్టులు, సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు కోర్టులు, హనుమకొండ నిట్‌లో రెండు కోర్టులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు కోర్టులు ఏర్పాటు చేయడంతో నిత్యం వందల మంది క్రీడాకారులతో టెన్నిస్ కోర్టులు కళకళలాడుతున్నాయి. అదే విధంగా నగరంలోని వివిధ ప్రయివేటు పాఠశాలలో సైతం లాన్ టెన్నిస్ క్రీడ విస్తరిస్తోంది. స్కిల్ స్ర్టోక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో టెన్నిస్ కోర్టులు అందుబాటులో ఉండటం ద్వారా రోజు రోజుకూ ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది.

చిన్నారులు, యువత ఆసక్తి చూపుతున్నారు

ఎ.నర్సయ్య, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

అత్యాధునిక టెన్నిస్ కోర్టులు జిల్లాతోపాటు నగరంలో అందుబాటులో ఉండటంతో చిన్నారులు, యువత ఈ క్రీడపై ఆసక్తి కనబర్చడంతో ఆదరణ పెరుగుతోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు యువత పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయం. జిల్లా వ్యాప్తంగా టెన్నిస్ క్రీడ మరింత విస్తరించేందుకు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తోంది.

టెన్నిస్ అంటే ఇష్టం

ధరణి, క్రీడాకారిణి

ఇతర క్రీడల కంటే టెన్నిస్ క్రీడ అంటే చాలా ఇష్టం. టెన్నిస్ క్రీడలో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావడమే నా లక్ష్యం. వేసవి సెలవుల్లో జేఎన్ఎస్ టెన్నిస్ కోర్టులో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా.. జిల్లా, రాష్ట్ర, జాతీయ టెన్నిస్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలనే సంకల్పంతో సాధన చేస్తున్నా..



గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

వర్ధన్నపేట రూరల్, మే 21 : ప్రభుత్వ నిషేధిత గంజాయిని ద్విచక్ర వాహనం లో తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. మంగళవారం వర్ధన్నపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ ఏఈఎస్ మురళీధర్ మాట్లాడుతూ డీటీఎఫ్ సీఐ రమేష్, ఎక్సైజ్ సీఐ స్వరూప, సిబ్బందితో కలిసి రూట్ వాచ్ చేస్తుండగా సంగెం మండలంలోని జాటోతు తండాకు చెందిన లావుడ్యా వెంకన్న ఎల్గూరు రంగంపేట ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో 100 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరిత, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

● ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి : మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్

శంభునిపేట, మే 21 : దేశాన్ని ఆదర్శంగా నిలిపిన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యం ఓటుతో గెలిపించాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ పట్టభద్రులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నగరంలోని రంగశాయిపేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పట్టభద్రులతో మంగళవారం బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. శేర్ల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఈటల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 250 స్థానాల్లో పోటీచేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం మెజారిటీ ఎలా సాధిస్తుందని, రాహుల్‌గాంధీని ప్రధానిని ఎలా చేస్తుందో రేవంత్‌రెడ్డి తెలపాలన్నారు. వందేళ్లచరిత్ర కలిగిన కాంగ్రెస్ పాలనలో స్కాములు తప్ప ఏం అభివృద్ధి జరిగిందో తెలపాలన్నారు. ముస్లిం మహిళలను గౌరవించి త్రిబుల్ తలాక్‌ను రూపుమాపారన్నారు. అయోధ్యలో రామమందిరం కట్టించిన యోధుడు మోదీ అన్నారు. డిసెంబరు 9న ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పిన రేవంత్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల ముందు మరో వాయిదా వేసి ఓట్లు అడిగిందన్నారు.

రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ శాసన మండలికి ఎమ్మెల్సీగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని పంపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌గౌడ్, కందిమల్ల మహేష్, కర్నె రవీందర్, సిద్ధం నరేష్ పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఓసిటీ, కొత్తవాడ పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఈటల మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కొరివి దయ్యాల పాలైందన్నారు. ప్రశ్నించే గొంతుకు పట్టం కట్టి రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగేందుకు కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఓటు చాలా విలువైందని, క్షుణ్ణంగా పరిశీలించి ఓట్లు చెల్లే విధంగా వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, సినీ హీరో అభినవ్ సర్దార్, నాయకులు అరూరి రమేష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మురళీధర్‌గౌడ్, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, అల్లం నాగరాజు పాల్గొన్నారు.

'గుజ్జుల'ను గెలిపించాలి: బీజేపీ

గీసుగొండ: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీకే రాంబాబు అన్నారు. ధర్మారంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం ధర్మారంలో ఆయన మంగళవారం పట్టభద్రులను, వాకర్స్ సభ్యులను కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మోసపూరిత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనతో ప్రజలు అసహనంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోదాసి అశ్వినికుమార్, కంది క్రాంతికుమార్, శ్రీనివాస్, రాంప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు. మొగిలిచర్లలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో గుజ్జులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆడెపు రమేష్, లెంకలపెల్లి స్వామి, వీరస్వామి, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు.


ఓ సిటీలో సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య


యాదగిరి (ఫైల్)

గిర్మాజీపేట, మే 21 : ఆర్థిక ఇబ్బందులతో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మంగళవారం రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. నగరంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన గుండా యాదగిరి(62) రెండేళ్ల క్రితం ఆర్టీసీ ఉద్యోగిగా పదవీ విరమణ చేశాడు. కాశిబుగ్గ సర్కిల్‌లో తన ఇద్దరు కుమారులతో కలిసి పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. చిన్నకుమారుడు రామకృష్ణకు బ్రెయిన్ స్ట్రోక్ సర్జరీకి లక్షల రూపాయలు ఖర్చవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం ఉదయం పాన్‌షాపు తెరిచిన యాదగిరి ఉదయం 10 గంటలకు పెద్ద కుమారుడు పాన్‌షాపుకు రావడంతో ఇంటికి వెళ్తున్నట్టు బయటకు వచ్చాడు. ద్విచక్రవాహనంపై నేరుగా జాన్‌పీరీలు సమీపంలో బంధువు ఇంటికి వచ్చి ద్విచక్రవాహనాన్ని అక్కడ పెట్టి సమీపంలోని రైల్వేగేటు వద్దకు చేరుకుని డౌన్‌లైన్‌లో వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

గీసుగొండ, మే 21: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)ను భారీ మెజారిటీతో పట్టభద్రులు గెలిపించాలని పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి అన్నారు. మంగళవారం గీసుగొండలో మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జర్నలిస్టుగా మల్లన్న ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తున్నానరన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జావీదు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శతఘటాభిషేకం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కాశిబుగ్గ, మే 21: కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం కార్యక్రమాలు చేపట్టారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దక్షిణ ముఖ ఆంజనేయస్వామికి శతఘటాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వంగరి రవి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి సుల్తానా సమ్మక్క, ప్రధానార్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు వంగరి సమ్మయ్య, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, రాగుల ప్రసాద్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, మే 21: జిల్లాలోని అర్హత గల గిరిజన విద్యార్థుల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకం కింద 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6లోగా హనుమకొండలోని అంబేద్కర్ భవన్ ఎదురుగా ఉన్న జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 12న కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిన విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ మల్లయ్య

కరీమాబాద్, మే21: కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 17న చోరీకి పాల్పడిన నిందితులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి పాఠశాలలో దొంగిలించిన మూడు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం. కరీమాబాద్ -బీరన్నకుంట ప్రాంతానికి చెందిన ప్లంబర్ పిడికల శివకుమార్, చేపల మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసే రాంపాక కిరణ్, అదే ప్రాంతానికి చెందిన పాత ఇనుప సామాను వ్యాపారం చేసే పసునూరి సాయికుమార్‌లు 17న కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీకి పాల్పడి, 3 బ్యాటరీలు, 13 బెంచీలు దొంగిలించారు. హెచ్ఎం రావూరి మాధవి 18న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సోమవారం ఎస్సై గోవర్ధన్ సిబ్బందితో ఉర్సు గుట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ ఆటోలో ముగ్గురు వ్యక్తులు వెళుతూ పోలీసులను చేసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా చోరీ విషయం బయటపడింది. దీంతో 13 బెంచీలు స్వాధీనం చేసుకుని మంగళవారం ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రాజీవ్‌గాంధీకి నివాళి


రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మీసాల ప్రకాష్

గిర్మాజీపేట, మే 21 : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు మంగళవారం 27వ డివిజన్ ఎల్‌వి ఆర్ కాలనీలో కాంగ్రెస్ డివి జన్ అధ్యక్షుడు దౌడు నా గ ాజు ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్య దర్శి మీసాల ప్రకాష్ హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాజరస్, ప్రభాకర్, శారద, ఎల్‌విఆర్ కాలని అభివృద్ధి కమిటి నాయకులు సరళాదేవి, శ్రీవిద్య, రేణుక,శ్రీలత,రబ్బాని పాల్గొన్నారు. అలాగే కూరగాయల మార్కెట్ బొడ్రాయి వద్ద కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకుడు కొమ్ము శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, విశాల్, రమేష్, శరత్,రాజు, జయకర్, గోపి, కొమ్ము అమర్, నర్సింగరావు పాల్గొని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు.

డీఆర్ఎఫ్ సిబ్బందికి అభినందనలు


మృతదేహాలను వెలిగి తీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మే 21: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ముసలమ్మ కుంటలో మంగళవారం రెండు మృతదేహాలు చూసినట్టు స్థానికులు ముందుగా పోలీసులకు సమాచారం అందించారు. ఏనుమాముల పోలీసులు మృతదేహాలను వెలికి తీసేందుకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) అధికారికి విషయం ఫోన్‌లో తెలిపారు. దీంతో సంబంధిత అధికారి శంకర్‌లింగం వరంగల్ టీంను అప్రమత్తం చేశారు. వరంగల్ డీఆర్ఎఫ్ సిబ్బంది శంకర్, సాయి, అశోక్, కిరణ్, యూనస్‌ఖాన్‌లు వెంటనే ముసలమ్మకుంటకు చేరుకున్నారు. వారి వద్ద ఉన్న పరికరాలతో కుంటలో దిగి రెండు మృతదేహాలను గుర్తించారు. తాళ్ల సహాయంతో రెండు మృతదేహాలు జన్ను విజయ్ (38) జన్ను ఆదాం (36)లను వెలికి తీశారు. రెండు మృతదేహాలను వెలికి తీయడానికి రెండు గంటల సమయం పట్టిందని టీం లీడర్ సాయి తెలిపారు. సకాలయంలో స్పందించి పోలీసులకు, మృతుల కుటుంబాలకు సహకరించిన డీఆర్ఎఫ్ సిబ్బందిని నగర కమిషనర్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

వయస్సు 26.. చోరీలు 30

● జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలు

● నిందితుడి అరెస్టు.. రూ.2.50 లక్షలు విలువైన బైక్ స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న మట్టెవాడ పోలీసులు

మట్టెవాడ, మే 21: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు వరంగల్‌లోని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 26ఏళ్ల తిరుమలేష్ జల్సాలకు అలవాటుపడి తొమ్మిదేళ్లుగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 30 కొత్త మోటార్ సైకిళ్లను దొంగిలించాడు. ఎవరైనా కొత్తబైక్ కొంటే వారితో మాటలు కలిపి ఒకసారి ట్రయల్ చేసి చూస్తానని నమ్మించి బైక్‌కు పరారవుతున్నాడు. ఇప్పటికే పలుమార్లు జైలుకు వెళ్లాడు. మే 9న ములుగురోడ్ ప్రాంతంలో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన కామెర అరవింద్ తన యమహా బైక్ సర్వీసింగ్ కోసం రావడంతో నిందితుడు తిరుమలేష్ అతడిని పరిచయం చేసుకొని ఇలాగే నమ్మించి బైక్‌తో పరార్ అయ్యాడు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి, బైక్ స్వాధీనం పర్చుకొని జ్యూడీషియల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. కేసు చేదనలో ప్రతిభకనర్చిన క్రైం కానిస్టేబుళ్ల అలీ, తిరుమతిలను సీఐ అభినందించారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

మట్టెవాడ, మే 21: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్‌మెలర్ అయితే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశ్నించే గొంతుకని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ హరిశంకర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పెద్దల సభకు మేధావులను పంపాలన్నారు. వరంగల్‌లోని విద్యావంతులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వచ్చిందని వారు ఆరోపించారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రజల పక్షాన పనిచేసే నాయకుడు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి, విద్యావంతులు, ప్రశ్నించే గొంతుక, విజన్ ఉన్న వ్యక్తి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా హమీం మసూద్, హరి రమాదేవి, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, బీఆర్ఎస్ నాయకులు పల్లం రవి, సయ్యద్ మసూద్, బి.శ్రీమాన్, బోగి, సురేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు పాటుపడాలి

గీసుగొండ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మొగిలిచర్ల, గీసుగొండ, బొడ్డుచింతపల్లి, కొమ్మాల, చంద్రయపల్లి, మచ్చాపూర్‌లలో కత్తెరపల్లి దామోదర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ విద్యావంతుడైన రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ మనో హర్, నాయకులు బాలు, మిద్దెపాక విజయ్, రవికుమార్, కళాధర్, కోట ప్రమోదు, మంద రాజేందర్, యుగేందర్,రాకేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్


పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి

వరంగల్ కలెక్టరేట్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ అన్నారు. 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎల్‌బీ కళాశాలలో పీవోలు, ఏపీవోలు, ఓపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంతోపాటు, ఎన్నికల సంఘం విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో బ్యాలెట్ పేపర్‌తోఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎల్‌బీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో మంగళవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 24 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బాలకృష్ణ, మాస్టర్ ట్రైనర్లు, పాల్గొన్నారు.

14 కిలోల గంజాయి స్వాధీనం


పోలీసులు పట్టుకున్న గంజాయి, గంజాయి తరలింపుదారులు

గిర్మాజీపేట, మే 21 : రైలులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. వరంగల్ జీఆర్పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. సోమవారం భువనేశ్వరి నుంచి ముంబాయి వెళ్తున్న కోణార్ ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్నటికి నాదాసు (37), బికి బేహరా (26)లను అరెస్ట్ చేసి వారి నుంచి 14.254 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసు కుని, ఇద్దరిని అరెస్టు చేశారు. విలువ సుమారు రూ.3.56లక్షలు ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌లో మహబూబాబాద్ నుంచి వరంగల్ వరకు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన దాసు, బేహరాలతోపాటు వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. నిందితులను కాజీపేట రైల్వేకోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించారు.

బాలాజీనగర్‌లో కాంగ్రెస్ ప్రచారం


పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రేణులు

కాశిబుగ్గ, మే 21: ఏనుమాముల, బాలాజీనగర్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీపీసీసీ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ అడుప మహేష్, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఇంటింటికి తిరుగుతూ మల్లన్నను గెలిపించాలని కోరారు. తీన్మార్ మల్లన్నపై అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ప్రతిపక్ష నాయకులపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఏనుమాముల గ్రామ అధ్యక్షుడు అభిలాష్, పురాణం రవి, టోని, ముచ్చర్ల స్టాలిన్, కోగిల సుధాకర్, గాదె అనిల్, వినయ్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి సిటీ బస్‌స్టేషన్ భవనం కూల్చివేత


జిలెటిన్ స్టిక్స్‌తో కూల్చివేసిన సిటీ బస్‌స్టేషన్ భవనం

గిర్మాజీపేట, మే 21 : వరంగల్ ఆర్టీసీ బస్టాండ్ పాత భవనాల తొలగింపు పనులు చకచకా సాగుతున్నాయి. రూ.70కోట్లతో అధునాతన బహుళ అంతస్తుల బస్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా పాత బస్‌స్టేషన్ కూల్చివేత కొనసాగుతున్న విషయం విదితమే. ఇప్పటికే జిల్లా బస్టాండ్‌ను కూల్చివేయగా, తాజాగా సిటీ బస్‌స్టేషన్‌ను అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత జనసంచారం లేని సమయంలో జిలెటిన్ స్టిక్స్‌తో భవనాలను కూల్చి వేశారు.

పురాతన భవనాలు దృఢంగా ఉండటంతో ఎక్స్‌కవేటర్లతో కూల్చడం సాధ్యం కాకపోవ డంతో, కూల్చివేతలకు పేలుడు పదార్థాలు ఉపయో గిస్తున్నారు. సిటీ బస్‌స్టేషన్ భవనంపై ఉన్న సెల్‌టవర్‌లు, ఏసీలను తొలగించ కుండానే భవనాలను కూల్చడంతో సెల్ టవర్, ఏసీలు పూర్తిగా శిథిలాల్లో కూరుకుపోయాయి. మంగళవారం శిథిలాలను తరలించా రు. ఈ కూల్చి వేతలు మరో నాలుగు రోజులు జరుగనున్నట్లు తెలిసింది. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రైయివేట్ కాంట్రాక్టర్ గత నెల 9 నుంచి కూల్చివేత చేపట్టారు. ముందుగా బస్‌స్టేషన్ ఆవరణలోని వాటర్ ట్యాంక్‌ను కూల్చివేస్తున్న సమ యంలో సరైన భద్రత చర్యలు చేపట్టకపోవడంతో వాటర్ ట్యాంక్ శిథిలాలకిందపడి కూలీ బొంతు రవి (49) ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బస్‌స్టేషన్‌ను దశలవారీగా కూల్చి వేస్తున్నారు.



వరంగల్ రూరల్



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఇస్మాయిల్

మట్టి తరలింపును అడ్డుకోవాలి

నెక్కొండ, మే 21: నెక్కొండ మండలంలోని పలు గ్రామాల నుంచి అక్రమంగా నల్లరేగడి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలభారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. ఇస్మాయిల్ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. మట్టి తరలింపు వల్ల చెరువులో ప్రమాదకరమైన పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయని ఈ గోతుల కారణంగా వర్షాకాలంలో తాగు నీటి చెరువుల్లోకి వెళ్లే మూగజీవాలు (పశువులు, మేకలు, గొర్రెలు) ప్రమాదాలకు గురై ప్రాణాలను సైతం కోల్పోతాయన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాని ఆయన కోరారు. కార్యక్రమంలో సీతారాములు, రమేశ్, వెంకటయ్య, అలీసాబ్ పాల్గొన్నారు.

‘మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తీన్మార్ మల్లన్నను గెలిపించాలి’

ఖానాపురం, మే 21: ప్రశ్నించే గొంతుక పట్టభద్రుల ఎంఎల్‌సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి(చింతపండు నవీన్) తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ అన్నారు. మంగళవారం బుధరావుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ ప్రజలకు అండగా నిలిచిన మల్లన్నకు మద్దతుగా నిలిచి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పల్స ప్రశాంత్, మహేష్, మొలకల మురళి, శంకర్, నజీర్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)ను భారీ మెజారిటీతో పట్టభద్రులు గెలిపించాలని పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి అన్నారు. మంగళవారం గీసుగొండలో మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జర్నలిస్ట్‌గా మల్లన్న ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తునానరన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జావీదు, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల జెండా పండుగ ర్యాలీ

దుగ్గొండి,మే21: మండలంలోని తిమ్మంపేటలో హనుమన్ భక్తులు జెండా పండుగ సందర్భంగా మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హనుమన్ మాలధారణ చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో హనుమన్ సంకీర్తనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈసందర్భంగా వారికి భక్తులు స్వాగతం పలుకుతూ టెంకాయలు సమర్పించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు రడం రాజేందర్, భూమ సదయ్యతో పాటు భక్తులు గిన్నె నర్సింహస్వామి, ఓంకార్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, తెప్ప శంకర్, గిన్నె భాస్కర్, పెండ్యాల సాంబయ్య, భాషబోయిన రాజేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెక్కొండ, మే 21 : నెక్కొండ మండలం రెడ్లవాడ, అలంకానిపేట, పత్తిపాక 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు నేడు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ ఆపరేషన్ ఆర్. శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఈ గ్రామాల పరిధిల్లోని విద్యుత్ తీగలను ఆనుకుని పెరిగిన చెట్లను తొలగించుటకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● చెన్నారావుపేట: నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని నర్సంపేట డీఈ ఆర్ శ్రీధర్ మంగళవారం తెలిపారు. మండలంలోని అమీనాబాద్, చెన్నారావుపేట 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల పరధిలో మరమ్మతులు చేపట్టడం కారణంగా విద్యుత్ సరాఫరాను నిలిపివేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయంనకు సహకరించాలని కోరారు.

పాఠశాల మౌలిక వసతుల పనులు పరిశీలన

దుగ్గొండి, మే21: మండలంలోని స్వామిరావుపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టి మౌలిక వసతుల పనులను మంగళవారం ఎంపీడీవో ఆరుంధతి పరిశీలన చేశారు. పాఠశాలలో విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు, నీటి వసతి పనులు నిర్వహిస్తుండగా పరిశీలన చేశారు.ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పనల్లో వేగం పెంచి పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘుపతి పాల్గొన్నారు.

తాటి చెట్టు నరికివేతపై చర్యలు తీసుకోవాలి

సంగెం, మే 21 :తాటిచెట్టు నరికి వేతపై అధికారులు చర్య తీసుకోవాలని సంగెం గ్రామ గౌడ సంఘం నాయకులు మంగళవారం వర్ధన్నపేట ఆబ్కారీ సీఐ స్వరూపకు ఫిర్యాదు చేశారు. సంగెం మండలం పల్లారుగూడ గ్రామ శివారు వల్యానాయక్ తండాలో ఆదే గ్రామానికి చెందిన గుగులోతు విజయ్‌సింగ్ కల్లు పారుతున్న తాటి చెట్టును జేసీబీతో తొలగించాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు దామోదర్, కార్యదర్శి అశోక్, డైరెక్టర్లు శివ కుమార్, రాజేష్, సదానందం, శ్రీనివాస్, వివాజీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

నర్సంపేట, మే 21: భారతమాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీమార్కెట్ చైర్మెన్ పాలాయిశ్రీనివాస్, మునిసిపల్‌ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ దేశ సౌభ్రాతృత్వం కాపాడడం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని వారు కొనియాడారు. ఐటీ, కంప్యూటర్ రంగాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత రాజీవ్‌గాంధీకేఏ దక్కుతుందన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయసాధన కోసం కార్యకర్తలు పాటుపడాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రయాకూబ్ రెడ్డి, నూనె పద్మ, ఇస్లావత్ పద్మాబాయి, ఆడెపు రమాదేవి, వేముల సారంగంగౌడ్, దూడెల సాంబయ్య, మోటం రవికుమార్, గాజుల రమేశ్, పుల్లూరి చిన్నరవి, గడ్డమీది తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దె న రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, జోరు వీరయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ ఈర్యనాయక్, కుండె కుమార్, బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి: మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, నాయకులు రాంచందర్, గంగాధర్‌రావు, కందికట్ల అనీల్, బానోత్ భాస్కర్, సునీల్‌రావు, సుధాకర్, మాధవరావు, శంకర్, రాఘవులు, రమేష్, సైదులు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి, మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, నాయకులు రాజు, శ్రీకర్, రాజు, సాంబయ్య కవిత, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

● నెక్కొండ : మండలకేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, డీసీసీ ప్రధానకార్యదర్శి రావుల హరిష్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివకుమార్, యూత్ అధ్యక్షుడు షైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

వర్ధన్నపేట రూరల్, మే 21 : రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నేరుగా స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి, ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి ఎంతమేర ధాన్యం నష్టం జరిగిందో తెలుసుకుంటున్నట్లు వివరించారు. ధాన్యం మొలకెత్తడం, మ్యాచర్ ఇబ్బందులు, తార్పాలిన్ల కొరత, కాంటాల్లో మోసాలు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కాంటాల్లో జాప్యం జరిగినా, రైతులను వేధించినా శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 60 శాతం ధాన్యం సేకరణ జరిగిందన్నారు. జూన్ మొదటి వారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు వందశాతం పూర్తి కావాలన్నారు. కాంటాలు పూర్తి చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి, రైతులకు డబ్బులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శివ ప్రసాద్‌రెడ్డి, సివిల్ సప్లయ్ మేనేజర్ సంధ్యారాణి, డీఆర్డీఏ కౌసల్యా దేవి, డీఎంవో ప్రసాద్ రావు, జేడీఏ ఉషాదయాల్, డీపీఎం భవాని, ఏపీఎం వేణు, సెక్రటరీ శ్రీనివాస రాజు, సీసీ గోలి కొమురయ్య, ఐకేపీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇల్లంద మార్కెట్‌లోని వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోపి

● ఐకేపీ నిర్వాహకుల్లో భయం భయం..

ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌కు ఉన్నతాధికారుల పరిశీలనలు, ఫోన్ల ద్వారా ఆదేశాలు వచ్చి ఒత్తిడి పెరుగుతుండడంతో ఐకేపీ నిర్వాహకుల్లో భయం పట్టుకుంది. కాసులిస్తేనే కాంటాలు అనే కథనం ఆంధ్రజ్యోతిలో వచ్చిన మరుసటి రోజు నుంచి ఉన్నతాధికారులు మార్కెట్ పై దృష్టి సారించారు. దీంతో హమాలీలు, నిర్వాహకులు రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కాంటాలు పెట్టి మిల్లులకు తరలిస్తున్నారు. ఏ క్షణంలో ఏ అధికారి వస్తారో తెలియక సతమతమవుతున్నారు. వరంగల్ డీపీఎం భవాని సైతం ఉదయాన్నే కేంద్రానికి చేరుకుని ముందుగా రికార్డులను పరిశీలించారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న జేడీఏ ఉషాదయాల్

వర్ధన్నపేట రూరల్, మే 21 : విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ సూచించారు. మంగళవారం వర్ధన్నపేటతో పాటు మండలంలోని ఇల్లంద, కట్ర్యాల, ఉప్పరపెల్లి, చెన్నారం, నల్లబెల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మన ప్రాంతానికి అనువైన నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. రైతులు తమ అనుభవాన్ని బట్టి, అధికారుల సూచనలతో విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాన్ని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి గుర్తింపు పొందిన, లైసెన్సు పొందిన డీలర్ నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. పచ్చి రొట్ట విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. దీంతో నేల సారాన్ని భౌతిక లక్షణాలను మెరుగుపరుచుకోవడంలో ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. నేలకు, తేమకు నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమలో ఏడీఏ సురేష్, పి సారంగం, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్‌టెంట్ కృష్ణారెడ్డి, టెక్నికల్ అధికారి శ్రీధర్, సాగరిక, ఏఈవోలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



ఎమ్మెల్యే మాధవరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ, డీబీడీపీఎస్ నాయకులు

నర్సంపేట టౌన్, మే 21 : నర్సంపేట పట్టణంలోని వరంగల్‌రోడ్‌లోని అంబేద్కర్‌నగర్‌లోని 813 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలని కోరుతూ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ జాతీయ అధ్యక్షుడు అందె రవిల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్, అందె రవిలు మాట్లాడుతూ ఎంఎస్‌పీ, డీబీడీపీఎస్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల క్రితం 813 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసుకుని జీవనం వెళ్లదీస్తున్నారన్నారు. నిల్వ నీడలేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం ద్వారా పేదలకు పట్టాలిచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ, డీబీఆర్పీఎస్ నాయకులు జలగం రమేష్, శ్రీకాంత్, లత, మాలతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన తహసీల్దార్

21సంగెం04 : సంగెంలో ఎమ్మెల్సీ పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసిల్దార్

సంగెం, మే 21 : సంగెం మండల కేంద్రంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పోలింగ్ స్టేషన్‌ను మంగళవారం సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా చూడాలని కింద స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు.

పూరిగుడిసె దగ్ధం

నల్లబెల్లి, మే 21: మండలంలోని గోవిందాపూర్‌లో ప్రమాదవశాత్తు పొయ్యి మంటలతో పూరిగుడిసె దగ్ధమైన సంఘటన సోమవారం అర్ధరాత్రి చేటుచేసుకుంది. బాధితురాలు బొట్ల సమ్మక్క తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సమ్మక్క భర్త, కుమారుడు చనిపోవడంతో మానసిక వికలాంగురాలైన మనుమరాలితో కలిసి పూరి గుడిసెలో ఉంటోంది. ఇంట్లోని గ్యాస్ అయిపోవడంతో సోమవారం సాయంత్రం ఇంటిలోని కట్టెల పొయ్యిపై వంట చేసుకుని తినిపడుకున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో పొయ్యిలోంచి ఒక్కసారిగా నిప్పు రాజుకొని మంటలు చేలరేగాయి. మంటలను గమనించి వెంటనే వారిరువురు బయటకు పరుగున వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటనలో పూరిగుడిసె పూర్తిగా దగ్ధం కాగా ఇంట్లో ఉన్న బియ్యం, వంట సామాగ్రి, బట్టలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. కాలిపోయిన వస్తువులు విలువ సుమారు రూ. 50 వేల వరకు ఉంటుందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని సమ్మక్క వేడుకుంది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

వర్ధన్నపేట రూరల్, మే 21 : ప్రభుత్వ నిషేదిత గంజాయిని ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. మంగళవారం వర్ధన్నపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ ఏఈఎస్ మురళీధర్ మాట్లాడుతూ డీటీఎఫ్ సీఐ రమేష్, ఎక్సైజ్ సీఐ స్వరూప, సిబ్బందితో కలిసి రూట్ వాచ్ చేస్తుండగా సంగెం మండలంలోని జాటోతు తండాకు చెందిన లావుడ్యా వెంకన్న ఎల్గూరు రంగంపేట ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో 100 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండుకు తరలించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరిత, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు

వర్ధన్నపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నర్సింహస్వామి

వర్ధన్నపేట రూరల్, మే 21: వర్ధన్నపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేతి నర్సింహస్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి బాధించిందన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విచారణ సాగుతోందని తెలిపారు. గర్భిణీలకు ఫోన్‌లో మాట్లాడుతూ వైద్యం చేశామనడంలో నిజం లేదన్నారు. బాధిత మహిళ మొదటి సారి వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలోనే నార్మల్ డెలివరీ జరిగిందని, మళ్లీ రెండోసారి కూడా నార్మల్ డెలివరీకి ప్రయత్నం చేశామన్నారు.



మాట్లాడుతున్న నర్సింహస్వామి

జన్మించిన శిశువుకు ఆక్సిజన్ లెవల్స్ తక్కువగా ఉండడంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించామని, మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. పూర్తి నివేదికలు ఉన్నతాధికారులకు అందించామని, నిజానిజాలు అధికారులు తేలుస్తారని వివరించారు. కానీ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ ఆసుపత్రి పట్ల, వైద్యుల పట్ల అసభ్యకరమైన పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి పట్టభద్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు



నర్సంపేటలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, మే 21: పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో నేడు(బుధవారం) జరిగే పట్టభ ద్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి ఇంటి సమీపంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను బుధవారం పార్టీనాయకులతో కలిసి సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొనే సమావేశానికి నియోజకవర్గంలోని పట్టభద్రులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, నియోజకవర్గ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్, యూత్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మండల శ్రీనివాస్, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని మందపల్లి, గిర్నిబావి, మధిర, రాజ్యతండా, చాపలబండ గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, గుండెకారి రంగారావు, గొనె రాజు, చాంద్‌పాష పాల్గొన్నారు.

● గీసుగొండ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాల ని మొగిలిచర్ల, గీసుగొండ, బొడ్డుచింతపల్లి, కొమ్మాల, చంద్రయపల్లి, మచ్చాపూర్‌లలో కత్తెరపల్లి దామోదర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మనోహర్, నాయకులు బాలు, మిద్దెపాక విజయ్, రవికుమార్, కళాధర్, కోట ప్రమోదు, మంద రా జేందర్, యుగేందర్,రాకేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి

ఖానాపురం, మే 21: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అన్నారు. మంగళవారం బుధరావుపేటలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జల్లి మధు, లింగబత్తుల యాకసాయన్న, బూడిద ముఖేష్, తవుటి రమేష్, కళ్యాణి, లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మంగళవారం మండలంలోని మైలారంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● గీసుగొండ: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీకే రాంబాబు అన్నారు. ధర్మారంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన మంగళవారం పట్టభద్రులను, వాకర్స్ సభ్యులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోదాసి అశ్వినికుమార్, కంది క్రాంతికుమార్, శ్రీనివాస్, రాంప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు. మొగిలిచర్లలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో గుజ్జులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆడెపు రమేష్, లెంకలపెల్లి స్వామి, వీరస్వామి, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు.



బుధరావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న రాజుయాదవ్

కుట్టు మిషన్ కేంద్రాలను వినియోగించుకోవాలి

నెక్కొండ, మే 21 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంల కుట్టుశిక్షణ కేంద్రాన్ని డీఆర్‌డీవో కౌసల్యాదేవి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని సమయంలో విద్యార్థుల యూనిఫామ్‌ల తయారుతో మహిళలు ఉపాధిని పొందడం ఆ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. యూనిఫామ్‌ల తయారులో నాణ్యతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌డీవో రేణుకాదేవి, డీపీఎం దయాకర్, ఏపీఎం శ్రీనివాస్, పీఎస్ భానుప్రసాద్, సీసీఎస్ రవీందర్, మాణిక్యం, శారద, వెంకటయ్య, వీఓలు పోశాల ఏకాంబ్రం, లత, మధులత, విమల, పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మహిళలు కుట్టు మిషన్ కేంద్రాలను వినియోగించుకోవాలని డీఆర్‌డీవో కౌలస్యదేవి అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఉన్న స్త్రీ శక్తి కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మహిళలు కుట్టులో చూపించాలన్నారు. నైపుణ్యంను కార్యక్రమంలో ఏపీవో ఈశ్వర్, మం జుల, వీవోఏ అస్మా, రమ, కోమల, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం అమలుపై సమీక్ష

పర్వతగిరి: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై మంగళవారం డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి ఆయా గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీగ్రామంలో యాక్టివ్‌గా ఉన్న కార్డుదారులందరికీ 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. మండలపరిధిలో 150 ఫాంపాండ్స్, 10 ఫిష్ బ్రీడింగ్ ఫార్మ్స్, 150 ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ చేయించాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో వర్షపునీటిని భూమిలో ఇంకేలా చేయడానికి గాను రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏపీవో సుశీల్‌కుమార్, ఆయా గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.